
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 13 డిసెంబరు 2024
5





ఖమ్మం కార్పొరేషన్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

మట్టి చదునుచేసి మమ అనిపించారు. నాలుగు స్తంభాలు పాతి ఆటస్థలం అన్నారు. క్రీడా ప్రాంగణాల పేరుతో బోర్డులు పెట్టి ప్రజలను బురిడీ కొట్టించారు. అనువుగాని స్థలాల్లో ఐరన్ స్తంభాలు పాతి క్రీడాకోర్టుల పేరుతో రూ.కోట్లు ఖర్చు చేశారు. ఇష్టారీతిన పనులు చేసి లక్ష్యాన్ని పక్కదారి పట్టించారు. గత ప్రభుత్వ హయాంలో హడావుడిగా నిర్మించిన క్రీడా ప్రాంగణాలు నేడు చెట్లు, తుప్పలతో దర్శనమిస్తున్నాయి.

నిధులు నిష్ఫలం!



- అనేకచోట్ల గ్రామాలకు దూరంగా స్థలాల ఎంపిక
- తాత్కాలిక పనులతోనే రూ.లక్షల్లో ఖర్చు
- ఉమ్మడి జిల్లాలో 1,178 ప్రాంతాల్లో ఏర్పాటు
- ఒకటి రెండు మినహా మిగిలినవన్నీ నిరుపయోగంగానే..
- చెత్తకుపలు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నవైనం

గత ప్రభుత్వంలో ఆర్భాటంగా క్రీడాప్రాంగణాల నిర్మాణం

ఖమ్మం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీగా క్రీడా ప్రాంగణాలు నిర్మించినా పనుల్లో నాణ్యతలోపం, నిర్వహణ లేమి, అన్నింటికి మించి ఊరికి దూరంగా ఈ క్రీడా మైదానాలు నిర్మించడంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం ఆయా క్రీడా ప్రాంగణాలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. క్రీడాకారులతో కళకళలాడాల్సిన ఆయా ప్రాంతాలు ప్రస్తుతం చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం వాటివైపు కన్నెత్తి చూసేవారు లేకపోవడంతో గతంలో క్రీడా ప్రాంగణాల పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు, ఐరన్‌పోల్స్ తుప్పు పట్టిపోయే స్థితికి చేరుకున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు ఆట స్థలం కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు నేడు నిష్ఫలంగా మారాయి.

అనువుగాని స్థలాల్లో ఏర్పాటు..

గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని సంకల్పించి అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీచేసింది. పెద్ద పంచాయతీల్లో ఎకరం, చిన్న పంచాయతీల్లో అర ఎకరానికి తగ్గకుండా ఉండేలా మైదానాన్ని ఎంపిక చేసి వాటిల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, లాంగ్ జంప్ కోసం కోర్టులను నిర్మించాలని నిర్ణయించారు. అందుకుగాను ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.4.16లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు నిధులు కేటాయించారు. ఆ నిధులతో స్థలాలను చదునుచేయడం, అవసరమైన ప్రాంతాన్ని మట్టితో నింపడం, ప్రాంగణాల చుట్టూ మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. క్రీడా ప్రాంగణాన్ని గ్రామంలో కానీ, గ్రామ సమీపంలో కానీ నిర్మించాల్సి ఉంటుంది. అయితే స్థలాల ఎంపిక నుంచే ఈ క్రీడా ప్రాంగణాల ఏర్పాటు గాడి తప్పింది. అప్పట్లోనే స్థలాల ఎంపికను అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపించాయి. ఏదో ఒక స్థలాన్ని సేకరించి అప్పగిస్తే తమ పని అయిపోతుందన్న రీతిలో అధికారులు వ్యవహరించారు. చెరువు శిఖం భూములు, రాళ్లు, రప్పలతో కనీసం నడవడానికి కూడా వీలులేని స్థలాలను క్రీడా ప్రాంగణాలకు ఎంపిక చేశారు. క్రీడా మైదానాలు పది కాలాలపాటు పిల్లలకు ఉపయోగపడాల్సింది పోయి, అసలు పిల్లలే అటువైపు వెళ్లలేని ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడం గమనార్హం.

లక్ష్యం ఘనం.. అమల్లో అలసత్వం

ఖమ్మం జిల్లాలో 754, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,261 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఆ తర్వాత నిధులు సక్రమంగా అందించలేకపోవడం, కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు దొరకకపోవడం వంటి కారణాలతో కాలక్రమేణా వాటి సంఖ్యను తగ్గించుకుంటూ వచ్చారు. అలా ఖమ్మం జిల్లాలో రూ.2.15కోట్లు ఖర్చు చేసి 505 క్రీడా ప్రాంగణాలు, కొత్తగూడెం జిల్లాలోనూ అదేస్థాయిలో నిధులు ఖర్చు చేసి 673 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. వాటితోపాటుగా నగరాలు, పట్టణాల్లో సైతం ఇదే తరహాలో నిధులు ఖర్చు చేశారు. ఖమ్మం నగరంలో మొత్తం 60డివిజన్లలో 49క్రీడా ప్రాంగణాలు నిర్మాణం చేయాలని భావించగా.. వాటిల్లో 44 పూర్తి చేశారు. వాటికి ఒక్కో ప్రాంగణానికి రూ.4.50 లక్షల వరకు ఖర్చు చేశారు. మిగిలిన పట్టణాల్లోనూ ఇదే తరహాలో ప్రాంగణాలు నిర్మించగా ఖర్చు కూడా అదే స్థాయిలో చేసినట్లు లెక్కలు చూపి మూడొంతుల నిధులు మింగేశారన్న ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో స్థలాలను లీజుకు తీసుకుని మరీ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆయా స్థలాలకు లీజులు చెల్లించకపోవడంతో యజమానులు తమ సొంత అవసరాలకు ఆ స్థలాలను వాడుకుంటున్నారు.

తల్లాడ మండలంలోని లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణానికి పంచాయతీ నుంచి నిర్వహణ కొనసాగాల్సి ఉండగా.. వారు లీజుకు సంబంధించిన నగదు చెల్లించకపోవడంతో ఆ స్థలానికి సంబంధించిన రైతు ఏకంగా దాంట్లో వరి సాగు చేశాడు. అయితే ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టుగా నిధులు కేటాయించలేకపోవడంతో ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.50 వేల నుంచి స్థలాల పరిస్థితిని బట్టి రూ.3లక్షల వరకు నిధులు అందించారు. దాంతో ఆయా క్రీడా ప్రాంగణాలన్నీ ప్రస్తుతం పనికిరాకుండా పోయాయి. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన నేపథ్యంలోనైనా క్రీడాప్రాంగణాలపై దృష్టిసారించి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గత తప్పిదాలను సరిదిద్దండి

- ప్రజలకు ఇబ్బందిలేకుండా పొరపాట్లు సరిచేయాలి
- అధికారులు పకడ్బందీగా విధులు నిర్వహించాలి
- ప్రభుత్వ, ఎన్నెస్పీ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టండి
- రోడ్లను ఆక్రమిస్తూ నిర్మించిన ర్యాంపులను తొలగించాలి
- ప్రతీ డివిజన్‌లో ప్రజలతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయాలి
- ఖమ్మం కార్పొరేషన్ సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల

ఖమ్మం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గతంలో ఎవరి ఒత్తిడి వల్లనైనా అధికారులు తప్పులు చేసి ఉంటే వాటిని సరిదిద్దుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పొరపాట్లను సవరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పునకొల్లు నీరజతో కలిసి గురువారం కార్పొరేషన్ కార్యకలాపాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధిలో ఖమ్మం కార్పొరేషన్ 2018లో ఎలా ఉందో ప్రస్తుతం కూడా అలాగే ఉందన్నారు. పైగా విధ్వంసం జరిగిందన్నారు. గోళ్లపాడు ఛానల్, ఆర్టీసీ బస్టాండ్, కార్పొరేషన్ కార్యాలయం వంటి వాటిల్లో జరిగింది అదేనన్నారు. కవిరాజ్‌నగర్‌లో ఎప్పుడూ రాని వరద వచ్చిందంటే ఎక్కడో తప్పు జరిగిందన్నారు. దాన్ని సరిదిద్దాలన్నారు. వర్షాకాలం వచ్చేలోపు పనులు పూర్తిచేయాలన్నారు. ప్రజాప్రతినిధులు ఎవరైనా ప్రజల అవసరాల కోసమే పనులు చేయాలని అడుగుతారనీ, ఒకవేళ ఎవరైనా తమ స్వార్థం కోసం పనులు చెబితే అధికారులు చేయాల్సిన అవసరం లేదన్నారు. అధికారులు విధులను పకడ్బందీగా పనిచేసి ఖమ్మం పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. కార్పొరేషన్‌లో విలీనమైన పంచాయతీలలో కార్మికుల కొరత, తాగు నీటి సమస్యలు, ఫాగింగ్ యంత్రాలు లేవని క్షేత్రస్థాయి నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. రోడ్లను ఆక్రమిస్తూ ర్యాంపులు నిర్మిస్తుంటే మునిసిపల్ సిబ్బంది సైలెంట్‌గా ఉండటం ఏంటని మంత్రి ప్రశ్నించారు. రోడ్లను ఆక్రమించి నిర్మించిన ర్యాంపులను వెంటనే తొలగించాలని మంత్రి ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. షాపింగ్ కాంప్లెక్స్, ఫంక్షన్ హాల్స్, వైన్ షాపుల ముందు వాహనాల పార్కింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రైవేట్ స్థలాల యజమానులు తమ స్థలాలకు ఫెన్సింగ్ వేసుకోవాలని, అక్కడ చెత్త చేరడానికి వీలు లేదన్నారు. దీన్ని అతిక్రమించిన వారికి రెండు, మూడుసార్లు నోటీసు ఇవ్వాలని అయినా యాజమానులు స్పందిచకుంటే చట్ట (మిగతా 6వ పేజీలో)

బొగ్గు రవాణాకు మోక్షం..

- ఫలించిన ప్రజా ప్రతినిధుల కృషి
- కిష్టారం నుంచి కాకినాడకు పునః ప్రారంభం
- సత్తుపల్లిలో స్థానిక లారీలకు అవకాశం
- ఖర్చుల పేరుతో టన్నుకు రూ.పది కిరాయి తగ్గింపు

7

'పీఎం కుసుమ్' ద్వారా సోలార్ విద్యుత్ యూనిట్లు

- గిరిజన గ్రామాలు, పొలాల్లో ఏర్పాటుకు ఎస్‌హెచ్‌జీ మహిళలకు అవగాహన కల్పించాలి
- అధికారులకు ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశం

7



సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

- రెండు రోజులుగా ధర్నా చేస్తున్న ఉద్యోగులు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిన విద్యాశాఖ

6

సర్వేలో సందేహాలు

- ప్రత్యేక యాప్‌తో ఇందిరమ్మ ఇళ్ల అర్జీదారుల వివరాల సేకరణ
- వివరాల నమోదులో పలు సమస్యలు
- గతంలోనే తీసుకున్నారని కొందరికి 'రెడ్‌మార్క్'

6



ప్రపంచాన్ని మార్చే శక్తి కమ్యూనిస్టులకే ఉంది

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- ఏదులాపురం గ్రామంలో సీపీఎం పాలేరు డివిజన్ 8వ మహాసభ

6



నమూనా ఇంటి నిర్మాణంపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఇందిరమ్మ ఇల్లు ఆదర్శంగా ఉండాలి

- నమూనా ఇంటికి నేడు మంత్రి పొంగులేటి శంకుస్థాపన
- కూసుమంచిలో స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

కూసుమంచి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు ఆదర్శవంతంగా ఉండాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కూసుమంచి మండలపరిషత్ ఆవరణలోని ఖాళీస్థలంలో ఇందిరమ్మ నమూనా ఇల్లు నిర్మించేందుకు ఉన్న అవకాశాలను గురువారం కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంచి స్థలంలో ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మించాలని తెలిపారు. ప్రజలు ఈ నమూనా ఇంటిని పరిశీలించి తమ స్థలాల్లో నిర్మించుకునేలా ఇంటి నిర్మాణం ఉండాలన్నారు. ఇందుకోసం మేస్త్రీలకు అవసరమైన శిక్షణ కూడా ఇదేప్రాంతంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగంగా జరుగుతోందని, మరో నెలరోజుల్లో ఇళ్ల గ్రౌండింగ్ జరుగుతాయన్నారు. నమూనా ఇంటి నిర్మాణానికి శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేస్తారని కలెక్టర్ తెలిపారు.

ధాన్యం సేకరణలో వేగం పెంచాలి

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో వేగం పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కూసుమంచి పీహెచ్‌సీ వెనుక ఉన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో నర్సింహారావు, స్పెషలాఫీసర్ శ్రీలత, తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రామయ్య చెంతకు మరో రైల్వే లైన్

- ఏలూరు నుంచి భద్రాచలం వరకు కొత్తలైన్ మంజూరు
- రూ.2,155కోట్లతో త్వరలో నిర్మాణం
- సాకారం దిశగా దశాబ్దాలనాటి భక్తుల కల



భద్రాచలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి సన్నిధికి మరో రైలుమార్గం మంజూరైంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు నుంచి భద్రాచలానికి ఈ కొత్త రైల్వే ప్రాజెక్టును మంజూరు చేసినట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. లోక్‌సభలో బుధవారం బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి ఈ ప్రాజెక్టు మంజూరైనట్టు వెల్లడించారు. 119 కి.మీ పరిధిలో ఉండే ఈ రైల్వేలైన్ ప్రాజెక్టుకు రూ.2,155కోట్లతో అంచనాలు తయారు చేసినట్లు లిఖిత పూర్వక సమాధానంలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దీంతో దశాబ్దాల నాటి భక్తుల కల సాకారం కానుంది. ప్రధానమంత్రి గతిశక్తి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా తెలంగాణలోని బూర్గంపాడు మండలం పాండురంగాపురం నుంచి ఒడిశాలోని మల్కానగిరి(జునాఘర్)కి రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం మల్కానగిరి-పాండురంగాపురం కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టు 173.6కి.మీలకు ఆమోదం తెలిపి రూ.3,592కోట్లతో పనులను చేపడుతున్నారు. అందులో భాగంగా ఆంధ్రా, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో భూసేకరణకు టెండర్లను సైతం ఆహ్వానించారు. తెలంగాణలో 19.7కి.మీ, ఏపీలో 85.5 కి.మీ, ఒడిశాలో 68.3కి.మీల రైల్వేట్రాక్ నిర్మించేందుకు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ భూ సేకరణ పూర్తయిన తరువాత ట్రాక్ నిర్మాణం ప్రారంభమవుతుంది.

సాకారం దిశగా దశాబ్దాల భక్తుల కల

అయోధ్యలో రామయ్యకు ఎంత విశిష్టత ఉందో అలాగే దక్షిణ అయోధ్యగా విరాజిల్లే భద్రాద్రి రామక్షేత్రంలో సైతం శ్రీసీతారామచంద్రస్వామికి అంతే విశిష్టత ఉంది. అయితే భద్రాచలం వచ్చేందుకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆశించిన స్థాయిలో భక్తులు రావడం లేదు. ఈ క్రమంలో కొన్ని దశాబ్దాలుగా భద్రాద్రి రామయ్య చెంతకు రైలుమార్గం ఏర్పాటు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. దాంతో ఇప్పటికే మల్కానగిరి-పాండురంగాపురం భూసేకరణ పనులు చేపట్టేందుకు ప్రక్రియ మొదలైంది. ఈ తరుణంలోనే ఏలూరు వయా సత్తుపల్లి-భద్రాచలానికి రైలుమార్గం మంజూరైందని కేంద్ర మంత్రి ప్రకటించడం పట్ల భక్తుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. సత్తుపల్లి నుంచి రైల్వేలైన్ ఏలూరు వరకు పొడిగిస్తారని, సత్తుపల్లి నుంచి భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) వరకు రైలుమార్గం ఉండటంతో కొత్తగూడెం వరకే రైలు వచ్చే అవకాశం ఉంది. అయితే భవిష్యత్తులో మల్కానగిరి-పాండురంగాపురం రైలుమార్గం అనుకున్న సమయానికి పూర్తయితే కొత్తగూడెం నుంచి భద్రాచలం వరకు రైలు వచ్చేందుకు వెసులుబాటు కలుగుతుందని తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు నిర్ణీత సమయానికి పూర్తయితే భద్రాద్రి రామయ్యను దర్శించేందుకు వచ్చే భక్తులకు రైలుమార్గం అందుబాటులోకి రానుంది.



సరిహద్దు అడవిలో తనిఖీలు చేస్తున్న రేంజర్ ఉపేందర్, సిబ్బంది

పంబాపురంలో పులి పాదముద్రలు

- ఆందోళనలో కరకగూడెం మండల ప్రజలు
- పెద్దపులి జాడకోసం అటవీ అధికారుల గాలింపు

కరకగూడెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల సరిహద్దు అయిన కరకగూడెం, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట మండలాల్లోని అటవీ ప్రాంతంలో కొన్ని రోజులుగా పెద్దపులి సంచరిస్తోంది. పెద్దపులి అలజడితో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బుధవారం ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు, నర్సింహసాగర్ అటవీ మార్గంలో పెద్దపులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. అంతేకాక భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లా సరిహద్దు తాడ్వాయి, ఏటూరునాగారం, మల్లూరు, నర్సింహసాగర్, కాటపురం, పంబాపురం, బీరెల్లి, రంగాపురం, గుండాల, ఆల్లపల్లి, కరకగూడెం మండలాల్లో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండడంతో పెద్దపులి కరకగూడెం మండలంలోని అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు అటవీశాఖ అధికారులు తెలపడంతో పలు మండలాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో కరకగూడెం మండలంలోని చిరుమళ్ల, రఘునాథపాలెం, మోతె, అనంతారం, తుమ్మలగూడెం, మోగిలితోగు, పద్మాపురం, రేగళ్ల, వీరాపురం అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించిన సందర్భాలు ఉన్నాయి. దాంతో మళ్లీ పెద్దపులి వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బుధవారం తాడ్వాయి, కరకగూడెం మండల సరిహద్దు పంబాపురం అటవీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించగా.. పంబాపురం అటవీ ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలు గుర్తించినట్లు తాడ్వాయి రేంజర్ నరేందర్ తెలిపారు. ఏడూళ్ల బయ్యారం రేంజర్ ఉపేందర్, అనంతారం సెక్షన్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అడవుల్లో పెద్దపులి పాదముద్రల కోసం గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా రేంజర్ ఉపేందర్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పెద్దపులి కరకగూడెం మండల సరిహద్దులో సంచరిస్తోందని, అయితే అది ఈ మండలం వైపు రావచ్చు, రాకపోవచ్చునని వివరించారు.



ఎన్టీఆర్‌కు సినీ నీరాజనం

- ఖమ్మంలో వజ్రోత్సవ వేడుకలు
- పార్టీలకతీతంగా అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ
- వేదికగా మారిన లకారం ఎన్టీఆర్ పార్క్, ట్యాంక్‌బండ్
- మంత్రి తుమ్మలను ఆహ్వానించిన కమిటీ సభ్యులు

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి, సినీ హీరో నందమూరి తారక రామారావు అభిమానులకు మరో శుభవార్త. తెలుగువారి ప్రతిభను, సినిమాను ప్రపంచవ్యాప్తంగా వెలుగులోకి తీసుకొచ్చిన ఎన్టీఆర్ సినీరంగ ప్రవేశానికి 75ఏళ్లు పూర్తి కావటంతో వేడుకలకు ఖమ్మంలోని ఎన్టీఆర్ అభిమానులు సై అంటున్నారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ సినీ ప్రస్థానాన్ని మరోసారి అభిమానులు ముందుంచేందుకు ఉమ్మడి తెలుగురాష్ట్రంలోనే ముందుగా ఖమ్మంలోని ఎన్టీఆర్ అభిమాన సంఘం ముందుకు వచ్చింది. కుల, మత రాజకీయాలకు అతీతంగా ఖమ్మం వేదికగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలను నిర్వహించేందుకు ఎన్టీఆర్ అభిమాన సంఘం ఏర్పాట్లు ప్రారంభించింది. ఈనెల 14తో ఎన్టీఆర్ సినీ ప్రస్థానానికి 75ఏళ్లు పూర్తి అవుతాయి. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ పార్కులో వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ చిత్రాల ప్రదర్శన, బహిరంగ సభ, కళాకారుల ప్రదర్శనలు, సినీ పరిశ్రమ నుంచి నటీనటులతో కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ముఖ్యఅతిథిగా మంత్రి తుమ్మలకు ఆహ్వానం

ఎన్టీఆర్‌కు అభిమానిగా టీడీపీలో పలు మంత్రి పదవులు నిర్వహించి ఎన్టీఆర్‌తో మంచి సన్నిహిత సంబంధాలు కొనసాగించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఖమ్మంలో నిర్వహించే సినీ వజ్రోత్సవాలకు ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. తుమ్మలను కలిసిన వారిలో పాలేపు విజయవెంకటరమణ, రావూరి సైదుబాబు, కన్నెబోయిన అంజయ్య, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, ఆళ్ల అంజిరెడ్డి, మిక్కిలినేని నరేందర్, కూతురు కృష్ణమూర్తి, కిలారు బాబీ పులిపాటి ప్రసాద్, మందడపు సుధాకర్, ఏలినేని రమణ, హనుమంత్‌రెడ్డి, జలగం రామకృష్ణ, లక్ష్మణ్‌రావు, బత్తుల బసవ పున్నయ్య ఉన్నారు.

ముక్కోటి ఏర్పాట్లను పరిశీలించిన ఈఈ



సూచనలిస్తున్న ఈఈ రాంప్రసాద్

దుమ్ముగూడెం డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):పర్ణశాలలో ముక్కోటి ఏర్పాట్లను ఇరిగేషన్‌శాఖ ఈఈ హెచ్‌వీ రాంప్రసాద్ గురువారం పరిశీలించారు. భక్తులకు స్నానఘట్టాల వద్ద షవర్ బాత్ కోసం అవసరమైన పనులు చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్‌శాఖల సమన్వయంతో షవర్ పనులకు అవసరమైన సామగ్రిని ముందే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే స్నానఘట్టాల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఉంచాలన్నారు. రైతుల పొలాలకు సాగునీటి ప్రవాహం కోసం పర్ణశాల అడ్డరోడ్డు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై నిర్మిస్తున్న పైపు కల్వర్టు పనులను పరిశీలించారు. డీఈ మధుసూదనరావు, ఏఈ రాజ్‌సుహాస్, జేఈ హర్ష, మస్తాన్‌వలీలున్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను

విద్యాశాఖలో విలీనం చేయాలి

- రెండు రోజులుగా ధర్నా చేస్తున్న ఉద్యోగులు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిన విద్యాశాఖ



ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి పే స్కేల్ అందించాలని కోరుతూ గత రెండు రోజులుగా కలెక్టరేట్ వద్ద గల ధర్నా చౌక్‌లో సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు ధర్నా నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావటంతో సమ్మెకు దిగారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని సర్వ శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)లో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని, వారి సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ తరువాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను మాత్రం ప్రభుత్వం అమలు చేయడం లేదు. దీంతో ఎస్ఎస్ఏ ఉద్యోగులు ప్రభుత్వ హామీలను అమలు చేయించాలని కోరుతూ పలు దఫాలు చర్చలు జరిపినా ఫలితం లేకపోవటంతో సమ్మెకు దిగారు. శుక్రవారం ఉద్యోగుల ధర్నాకు టీపీయూఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమరెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఎస్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ ప్రధాన డిమాండ్ పేస్కేల్ అమలు చేయాలని లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేసి ప్రజా సమస్యగా మారుస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 14 కేజీబీవీ, ఎస్ఎస్ఏలలోని సుమారు 6వేల మంది ఉద్యోగులు నిరాహార దీక్షలు చేపట్టారు. కేజీబీవీల్లోని బోధన సిబ్బంది, ఎంఈవో కార్యాలయాల్లో పనిచేసే సీఆర్పీలు, సీసీవోలు, మెసెంజర్లు సమ్మెలో పాల్గొన్నారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయడంతోపాటు ఇతర సమస్యలు పరిష్క రించాలని కొద్దిరోజులుగా నిరసన దీక్షలు చేపడుతుండగా గురువారం నుంచి సమ్మెకు దిగారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన విద్యాశాఖ కమిషనర్ జరిగిన చర్చలు ఫలించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా తెలిపారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్షలో ఆయన మాట్లాడారు. మేము 24 గంటలూ విధుల్లోనే ఉంటున్నాం. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నాం. మాకు కనీస వేతనాలు కూడా అందటంలేదని, ఇదెక్కడి న్యాయం.. అని ఆవేదన వ్యక్తం చేశారు. మేము సమ్మెలో ఉన్నప్పటికీ.. పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భోజనం పెడుతున్నాం. వారికి రక్షణ కల్పిస్తున్నాం. పాఠాలు మాత్రమే చెప్పడం లేదు. రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌తో చర్చలు జరపగా కొన్ని డిమాండ్ల వరిష్కారానికి అంగీకరించారని తెలిపారు. అయితే, ప్రధానమైన పేస్కేల్ అమలుపై నిర్ణయం రాకపోవడంతో సమ్మెకు వెళ్లాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సమ్మె విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. దీక్షలో అనిల్, ఇస్మాయిల్, సైదులు, విజయలక్ష్మి, సాంబశివరావు, నాగేందర్, సురేశ్, కృష్ణప్ర సాద్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా పాఠశాలలు

ఎస్ఎస్ఏ ఉద్యోగులు ధర్నాకు దిగి విద్యార్థులకు పాఠాలు బోధించకపోవడంతో ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా పలు చర్యలు చేపట్టింది. కేజీబీవీలలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో బోధన ప్రారంభించారు. శుక్రవారం జిల్లాలోని అన్ని కేజీబీవీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు హాజరై పాఠాలు బోధించారు. విద్యార్థులకు అల్పాహారం, భోజనం మాత్రం పాత ఉద్యోగస్తులే అందిస్తున్నారు. సమ్మె జరిగినన్ని రోజులు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని మండల విద్యాశాఖఅధికారులు తెలిపారు.

కేంద్రం వైఖరితో సంక్షోభంలో వ్యవసాయ రంగం

తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం

ఖమ్మంటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మోదీది రైతు వ్యతిరేక ప్రభుత్వమని, కేంద్రప్రభుత్వ వైఖరితోనే వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు విమర్శించారు. గురువారం జిల్లా సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం జిల్లాసమితి సమావేశంలో బాగం మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కనీస మద్దతు ధరల హామీ చట్టాన్ని అమలు చేయటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారంకోసం ఈనెల 16న రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, మందడపు రాణి, పుచ్చకాయల సుధాకర్, బాణోత్ రాంకోటి, బాగం ప్రసాద్, పదిమల వెంకటనర్సయ్య, మార్గం శ్రీనివాసరావు, కట్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని మార్చే శక్తి కమ్యూనిస్టులకే ఉంది

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

ఖమ్మం రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని మార్చే శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం గ్రామంలో సీపీఎం పాలేరు డివిజన్ 8వ మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తమ్మినేని మాట్లాడుతూ ప్రపంచంలో కమ్యూనిస్టులకు అనుకూల వాతావరణం ప్రారంభమైందన్నారు. శ్రీలంక, నేపాల్, ఫ్రాన్స్ దేశాల్లో ఎర్రజెండా ప్రభుత్వాలు ఏర్పడ్డాయని, భవిష్యత్‌లో మరిన్ని దేశాల్లో ఎర్రజెండా ప్రభుత్వాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులకు ఎదురుదెబ్బలు తగులుతున్నాయని, కానీ గత కొన్ని సంవత్సరాలుగా మంచిరోజులు ప్రారంభమయ్యాయన్నారు. మంచిపై చెడు గెలిచేది తాత్కాలికమేనన్నారు. పెట్టుబడి దారులకు, దోపిడీదారులకు కమ్యూనిస్టులంటే భయమని అందుకే కమ్యూనిస్టులపై నిత్యం విషప్రచారం చేస్తూ బురద చల్లుతూ ప్రజల్ని మభ్యపెడుతూ ఉంటారని విమర్శించారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. లగచర్లలో ఫార్మాసిటీ కేటాయించకుండా ఆపిన ఘనత వామపక్షాలకు దక్కుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఐదు లక్షల ఎకరాల భూములకు పోడు పట్టాలు ఇవ్వటంలో ప్రధాన పాత్ర కమ్యూనిస్టులదేనని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి 75 ఏళ్లలో అత్యధిక కాలం ఈ దేశాన్ని కాంగ్రెస్ పరిపాలించిందని, ఈ దేశ అభివృద్ధిని అడ్డుకోవడంలో కాంగ్రెస్‌ది ప్రధానపాత్ర అన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రైతు భరోసా, రుణమాఫీ, నిరుద్యోగ భృతి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 25మందితో డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి బండి రమేష్, నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, భూక్యా వీరభద్రం, రాంబాబు, భారతి,వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్ రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, బుగ్గవీటి సరళ, సిద్దినేని కోటయ్య, నంద్రా ప్రసాద్, బషీరుద్దీన్, జక్కంపూడి కృష్ణ, రమేష్, రమాణారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు

ఇళ్ల స్థలాలివ్వాలి

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీళ్లు, నిధులు, నియామకాలు దక్కాలంటే ప్రత్యేక రాష్ట్రమే అవసరమని 16ఏళ్లు తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటాలు చేసిన తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 60ఏళ్ల తెలంగాణ ప్రాంత ప్రజల ఆకాంక్షలు 16ఏళ్ల పోరాటాలతో నెరవేరాయన్నారు. ఉద్యమకారులు ఉద్యమాల సమయంలో తమ ఉద్యోగ, ఉపాధి, కూలీ పనులను త్యాగాలు చేసి పోరాటాలు చేశారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఏడాది పరిపాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవటంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోందని ఆరోపించారు. నాయకులు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్, డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నాయకులు సీహెచ్ శిరోమణి, ఆవుల మంగతాయి, శోభ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

లింగనిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని

పకడ్బందీగా అమలుచేయాలి

- వైద్యాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి
- సమీక్ష సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్, సీపీ

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం ఖమ్మం పోలీస్‌కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేకచట్టం అమలుపై జిల్లా మల్టీమెంబర్ అప్రోప్రియేట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అబార్షన్లు ఎక్కడ జరుగుతున్నాయో తనిఖీలు చేయాలన్నారు. అన్ని శాఖల సహకారంతో అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నెలకొకసారి తనిఖీలను నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. ఆడ పిల్లల రక్షణ (సేవ్ ది గర్ల్ చైల్డ్)పై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఆడపిల్లల పట్ల వివక్షతపై చర్చలు నిర్వహించి చైతన్యం కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశాల్లో ఆడ పిల్లల రక్షణపై అవగాహన కల్పించాలన్నారు. రైల్వేస్టేషన్, బస్‌స్టాండ్, మునిసిపల్ కార్పొరేషన్ జనసమ్మర్ద ప్రదేశాల్లో హోర్డింగ్స్ పెట్టాలని, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, కార్యాలయాల్లో పోస్టర్స్, కరపత్రాలు ప్రదర్శించి అవగాహన కల్పించాలన్నారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా అధికారులు బేటీ బచావో, బేటీ పడావోపై ప్రజలకు అవగాహన పెంచి, ఆడపిల్ల పుట్టిన తల్లికి మహిళ శిశు సంక్షేమ శాఖ ద్వారా బహుమతులతో ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో ఆశాలు గర్భిణులను గుర్తించే క్రమంలో ఎవరైనా అబార్షన్ చేయించుకుంటే వారి పూర్తి వివరాలను తెలుసుకొని అవగాహన కల్పించాలన్నారు.

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ చట్టాన్ని అతిక్రమించి లింగనిర్ధారణ పరీక్షలు జరిపి, అబార్షన్ చేస్తే చట్ట ప్రకారం వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలోనే కాకుండా పక్క జిల్లాల నుంచి కొందరు ఆర్ఎంపీలు గర్భిణులను ఇక్కడి తీసుకొచ్చి అబార్షన్ చేయిస్తున్నారని, అలాంటి వారికి కొందరు వైద్యులు సహకరించి కమీషన్లు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఇకపై ఇలాంటి చర్యలు చేపట్టవద్దన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ లీగల్‌సెల్ కేవీ. చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ లీగల్ సర్వీస్‌సెల్ ద్వారా గ్రామస్థాయిలో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆడపిల్ల రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కళావతిబాయి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చందునాయక్, డాక్టర్ వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, డీసీపీవో విష్ణువందన, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కంభంపాటి నారాయణరావు, డాక్టర్ రహేనాబేగం, డెమో సాంబశివ రెడ్డి, జాగృతి ఎన్జీవో కుముదిని తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో సందేహాలు

- యాప్‌తో ఇందిరమ్మ ఇళ్ల అర్జీదారుల వివరాల సేకరణ
- వివరాల నమోదులో పలు సమస్యలు
- గతంలోనే తీసుకున్నారని కొందరికి 'రెడ్‌మార్క్'



ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

వైరా, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా నడుస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జనానికి సవాలక్ష సందేహాలు వ్యక్తమవుతున్నా యి. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఇందిరమ్మ ఇళ్లకు రూపొందించిన యాప్‌తో కొద్దిరోజుల నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ యాప్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ యాప్ ద్వారా మండలస్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవోల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఒక్కో పంచాయతీ కార్యదర్శి కనీసం యాప్‌లో 35దరఖాస్తుదారుల వివరాలను సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని టార్గెట్ విధించారు. అయితే ఈ సర్వే జరుగుతున్న తీరుపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల హయాంలో అరకొరగా డబుల్‌బెడ్‌రూం నిర్మించటం తప్ప ఎక్కడా పక్కాగృహాలు నిర్మించలేదు. అయితే 2023 సాధారణ ఎన్నికలకు ముందు సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేవారికి రూ.మూడు లక్షల చొప్పున ఇస్తూ కొందరికి ఇళ్లు మంజూరు చేశారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు మంత్రులు, ఎమ్మెల్యేలు లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇచ్చిన యాప్‌లో మంజూరు పత్రాలు అందుకున్న వారిని లబ్ధిదారులుగా చూపిస్తుండటంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆ యాప్‌లో రెడ్‌సిగ్నల్ వస్తుండంతో గతంలోనే మీరు లబ్ధిదారులుగా ఉన్నారని సర్వేకు వెళ్లిన వారు స్పష్టం చేస్తుండటంతో ఇదెక్కడి చోద్యమంటూ అర్హులైన పేదలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి ఏపీలో అంతకముందు ఇందిరమ్మ పక్కా ఇళ్లు తీసుకున్నా ప్రభుత్వం నుంచి ఇళ్లస్థలాలు పొందిన వారికి కూడా రెడ్‌మార్కే చూపిస్తోంది. ఇకపోతే ఒకే ఇంట్లో తండ్రి, ఇద్దరు, ముగ్గురు కుమారులుంటే తండ్రిని యజమానిగా పరిగణిస్తూ కుమారుల పేరుమీద స్థలం ఉన్నట్లు అగ్రిమెంట్ కావాలని సర్వే సిబ్బంది స్పష్టం చేస్తున్నారు. ఒక వేళ స్థలాలకు సంబంధించి అగ్రిమెంట్ లేకుంటే కుమారుల పేరుమీద కనీసం కరెంట్‌బిల్లు, లేదా ఇంటిపన్ను రసీదు కావాలని స్పష్టం చేస్తున్నారు. ఇంకా అనేక అంశాలు ముందుకు రావడంతో సర్వే ఆలస్యమవ్వడమే కాకుండా అర్హులైన పేదలకు అన్యాయం జరిగి నష్టపోయే పరిస్థితి ఉందని అనేకమంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత తప్పిదాలను సరిదిద్దండి

(5వ పేజీ తరువాయి)



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, అధికారులు

ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ, ఎన్నెస్పీ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు.

ప్రతీ డివిజన్‌కు ప్రత్యేక వాట్సప్ గ్రూప్..

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఒక్క డివిజన్‌కు ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ తయారు చేసి అందులో డివిజన్ ప్రజలను భాగస్వాములను చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఆయా గ్రూపుల్లో కార్పొరేషన్‌కు సంబంధించిన డివిజన్ ఇంజనీర్ అధికారులు, డివిజన్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది ఉండేలా చూడాలన్నారు. తద్వారా డివిజన్లలో ఏర్పడే సమస్యలు వెంటనే అధికారుల దృష్టికి వస్తాయన్నారు. నగరంలో చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ప్రాజెక్టును రాబోయే 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించాలన్నారు. ఖమ్మంలో కుక్కల నియంత్రణకు వాటి సంతతిని నియంత్రణ ఆపరేషన్ లక్ష్యాలను పెంచాలన్నారు. నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి వంటి మదక ద్రవ్యాల సరఫరా, వినియగం జరగడానికి వీల్లేదన్నారు. గంజాయి విక్రయదారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు.

సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ప్రతి వాహనాన్ని జీపీఎస్ ద్వారా మానిటరింగ్ చేస్తున్నామన్నారు. కార్పొరేషన్ పరిధిలో జ్యూస్ షాపులు, హోటల్స్, నాన్‌వెజ్ దుకాణాలు, ఫంక్షన్ హాల్స్ తదితర వాణిజ్య కార్యకలాపాలు జరిగే ప్రాంతాలనుంచి వచ్చే చెత్త రోడ్లపై పడకుండా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి డివిజన్‌లో అపరిశుభ్రంగా ఉండే ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా జియోట్యాగ్ చేసి ప్రతినెల పూర్తిస్థాయిలో శుభ్రం చేస్తున్నామన్నారు. పారిశుధ్య సిబ్బంది కేటాయింపు ప్రతిడివిజన్‌కు ఒకేలా కాకుండా శాస్త్రీయ పద్ధతిలో చేస్తున్నామన్నారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ప్రతి డివిజన్‌కు పారిశుధ్య ప్రణాళిక తయారు చేశామని తెలిపారు. ప్రతిడివిజన్‌కు సంబంధించిన వాటర్‌మ్యాన్, లైన్‌మ్యాన్, పారిశుధ్య సిబ్బంది వివరాలు సంబంధిత ప్రజలకు తెలిసేలా గోడలపై రాశామన్నారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించామన్నారు. కార్పొరేషన్ ఆఫీస్‌లో పారిశుధ్య కంట్రోల్‌రూమ్ శుక్రవారం ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, పలు శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా..!

- భద్రాద్రి ప్రధాన రహదారుల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న జాతీయ రహదారుల శాఖ
- గుంతలను పూడ్చిన డిగ్రీ కళాశాల విద్యార్థులు, పోలీసులు



కలెక్టర్ ఆదేశంతో గుంతలు పూడ్చిన పోలీసులు

భద్రాచలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద జాతీయ రహదారిపై పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చో టు చేసుకుంటున్నా యి. ఫలితంగా ఎందరో తీవ్ర గాయాలపాలై ఆ సుపత్రుల పాలవుతున్నా రు. పరిస్థితి ఇంత అధ్వానం గా ఉన్నా జాతీయ రహదారుల శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పట్టణ పరిధిలో కనకదుర్గ ఆలయం సమీపంలో, రెడ్‌క్రాస్, సీఆర్‌పీఎఫ్ క్యాంపుతో పాటు ఇతర ప్రాంతాల్లో రహదారి ఎత్తు పల్లాలుగా ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల కాలంలో ఈ రహదారిపై ప్రయాణిస్తున్న వారు తరచూ ద్విచక్ర వాహనంపై కిందపడటం తీవ్ర గాయాలపాలవడం జరుగుతోంది. కొన్ని సమయాల్లో యువకులు వేగంగా వాహనాలు నడపడం వల న ద్విచక్ర వాహనం జారి కిందపడి తీవ్రంగాగాయాలపాలైన ఘటనలు సైతం లేకపోలేదు.



రోడ్డుపై ఏర్పడిన గుంత

ఏడాది కాలంగా ఇదే పరిస్థితి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో జాతీ య రహదారి ఇంత అధ్వానంగా ఉన్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా ఆక్షేపణలు వ్యక్తమవుతున్నా యి. సుమారు ఏడాది కాలంగా ఈ పరిస్థితి ఎ దురవుతున్నా అధికారులు స్పందించకపోవడం ఎంత వరకు సమంజసమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఎత్తు పల్లా లుగా ఉన్న ప్రాంతాలను చదును చేసి కొత్త ర హదారిని వేయాలని దీని ద్వారా ప్రమాదాలను నివారించాలని భద్రాద్రివాసులు కోరుతున్నారు.

గుంతలు పూడ్చిన విద్యార్థులు

జాతీయ రహదారుల శాఖ అధికారులు స్పందించకపోవడంతో గత నెలలో భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వయంగా తమ కళాశాల సమీపంలో ఉన్న రోడ్డుపై గుంతలను పూడ్చారు. అలాగే అంబేద్కర్ సెంటర్ మూలమలుపు వద్ద ప్రమాదకర గుంతలు ఏర్పడటంతో కలెక్టరు జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు భద్రాచలం పోలీసులు ఆ గుంతలను సిమెంటుతో పూడ్చారు. జాతీయ రహదారుల శాఖ చేయాల్సిన పనులను ఇలా ఇతర ప్రభుత్వ విభాగాలు చేస్తున్నా ఆ శాఖ అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తుండటం వారి పనితీరుకు అద్దం పడుతోందని భద్రాద్రి వాసులు విమర్శిస్తున్నారు.

క్రైం సమాచారం

ముగ్గురు చోరీ నిందితుల అరెస్టు

» ఆటో, బైక్ స్వాధీనం » వివరాలు వెల్లడించిన ఎస్ఐ లక్ష్మీభార్గవి



నిందితులను చూపుతున్న ఎస్ఐ

మధిర రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంతోపాటు ఇతర ప్రాంతాల్లో కొంతకాలంగా బడ్డీ కొట్టుకులను టార్గెట్‌లను చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారినుంచి ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు మధిర రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి తెలిపారు. గురువారం మధిరరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గురువారం ఉదయం 11గంటల సమయంలో తనతోపాటు సిబ్బంది కృష్ణాపురం గ్రామసమీపంలోని వెంచర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక ఆటో మధిర నుంచి వైరా వైపు వెళ్తుంది. ఈ ఆటోలో ఉన్నవారిని తనిఖీ చేస్తుండగా పారిపోవాలని మధిర వైపు ఆటోను తిప్పుతుండగా ఆటోను ఆపి పట్టుకున్నారు. ఆటోలో ఉన్న వారిని విచారించారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల రాజేష్, మధిర పట్టణానికి చెందిన యాసారపు రవికుమార్, మధిర మండలం నాగవరప్పాడు గ్రామానికి చెందిన పోక వెంకటేష్ వీరుముగ్గురు స్నేహితులు. మద్యానికి బానిసై ముగ్గురు కలిసి ఆటోలో తిరుగుతూ దొంగతనాలు చేస్తున్నట్లుగా తెలిపారు. ఖమ్మం, మధిరల్లో మూడు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు.

ఇటీవల సిరిపురం గ్రామంలోని బడ్డీకొట్టులో కూడా ఈ ముగ్గురు దొంగతనం చేసినట్లు తెలిసినట్లు ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి ఆటో, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ పల్టీ: డ్రైవర్ దుర్మరణం



కృష్ణారావు మృతదేహం

ముదిగొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు కథనం ప్రకారం ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన కొత్త కృష్ణారావు(43) కూలీలను తీసుకువచ్చేందుకు గ్రామంలోని చల్లసముద్రం చెరువు కట్టపై వెళుతుండగా ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. ట్రాక్టర్ కృష్ణారావు పై పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య కవిత, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదుమేరకు సీఐ మురళి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టిప్పర్ దగ్ధం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మట్టిలోడుతో వస్తున్న టిప్పర్ ఒకటి షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన ఘటన గురువారం సత్తుపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని జగన్నాధపురం పరిసర ప్రాంతాల నుంచి మట్టి తోలకాలు సాగిస్తుండగా మట్టిలోడుతో ఓ టిప్పర్ సత్తుపల్లి పట్టణానికి వస్తుంది. ఈ క్రమంలో కిష్టారం ఓసీ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన డ్రైవర్ అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్యాబిన్‌లో మంటలను అదుపుచేయడంతో పెనుప్రమాదం తప్పింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన ప్రయాణికులు

మణుగూరుటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండలంలోని సమితిసింగారం పీవీ కాలనీ రహదారి నర్సింహాస్వామి గుడి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు.. బావికూనవరం గ్రామం నుంచి మణుగూరు వైపునకు వస్తున్న ఓ ఆటోలో ఎన్టీఆర్‌నగర్ ప్రాంతానికి కలగూర రామ్మూర్తి, ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి, పొట్టెమ్మలతో పాటు అశోక్‌నగర్ చెందిన షేక్ ఇసాక్‌పాషా ఉన్నారు. ఆటో నర్సింహాస్వామి ఆలయ సమీపంలో ఆగిన ఉన్న మరో ఆటోను బలంగా ఢీ కొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను మణుగూరు ప్రభుత్వఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలందిస్తున్నారు. ఈప్రమాదంపై బాధిత కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యా దు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఏన్కూరు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీని పోలీసులు గురువారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం గార్లొడ్డు సమీపంలోని శ్రీలక్ష్మీనర్సింహా క్రషర్ మిల్లు దగ్గర రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీనీ విశ్వసనీయ సమాచారం మేరకు ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం తెల్లవారు జామున దాడిచేసి పట్టుకున్నారు. లారీలో 63.70 క్వింటాలు(168 బస్తాలు) బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ సంఘటనకు సంబందించిన ముగ్గురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రఫీ తెలిపారు.

రూ.47లక్షలకు దివాలా పిటీషన్ దాఖలు

ఖమ్మం లీగల్ డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన మరుసకట్ల మనోహర్ ఖమ్మంలో చిరు వ్యాపారం నిర్వహించేవాడు. వ్యాపారాభివృద్ధి కోసం తన స్నేహితులు, బంధువుల అధిక వడ్డీలకు రుణాలు తీసుకొని హోటల్ వ్యాపారం నిర్వహించాడు. వ్యాపారం సరిగా నడవక నష్టాలు రావడంతో రుణదాతలు ఒత్తిడి అధికమవడంతో

గురువారం ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటీషన్ దాఖలుచేశాడు. మొత్తం 14 మందిని చూపిస్తూ రూ.47 లక్షలకు దివాలా పిటీషన్ తన న్యాయవాది ద్వారా దాఖలు చేసినాడు.

గ్రూప్-2 పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

ఖమ్మంక్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఈనెల 15,16 తేదీల్లో జరిగే గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో ఆయా కేంద్రాల వద్ద బీఎన్ఎస్ సెక్షన్ 163 అమల్లో ఉంటుందని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్-2 పరీక్ష నిర్వహించే 85 పరీక్షా కేంద్రాల వద్ద 15వతేదీ ఉదయం 6గంటల నుంచి 16వతేదీ సాయంత్రం 6ంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాలకు 200మీటర్ల దూరం వరకు 5గురికి మించి గుంపులుగా ఉండకూడదని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకుల డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్‌నెట్ సెంటర్లు, జిరాక్సు షాపులు మూసివేయాలన్నారు. కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీసు పెట్రోలింగ్ పార్టీలను నియమించామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీపీ పేర్కొన్నారు.

బొగ్గు రవాణాకు మోక్షం..

» ఫలించిన ప్రజాప్రతినిధుల కృషి
» కిష్టారం నుంచి కాకినాడకు పునః ప్రారంభం
» స్థానిక లారీలకు అవకాశం
» ఖర్చుల పేరుతో టన్నుకు రూ.పది కిరాయి తగ్గింపు



సత్తుపల్లిలో బొగ్గు రవాణాకు సిద్ధంగా ఉన్న లారీలు

సత్తుపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు కిష్టారం ఓపెన్ కాస్టు నుంచి కాకినాడ వరకూ బొగ్గు రవాణా తిరిగి ప్రారంభమైంది. నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన రవాణాలో భాగంగా సత్తుపల్లి మండలం కిష్టారం ఓపెన్ కాస్టు నుంచి ప్రస్తుతం రోజుకు వంద లారీల్లో మూడు వేల టన్నుల బొగ్గు రవాణా జరుగుతోంది. గత ఏడాది కాలంగా కాకినాడకు బొగ్గు రవాణా నిలిచిపోవటంతో సత్తుపల్లిలో లారీ యజమానులు కిరాయిలు దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సతుపల్లిలో 700 లారీలు..

సతుపల్లి కేంద్రంగా మొత్తం 850 లారీలు ఉండగా వీటిలో కొందరు లారీలు అమ్ముకోగా, మరి కొన్ని లారీలను ఫైనాన్స్ కట్టలేక ఆయా సంస్థలకు అప్పగించారు. మిగిలిన లారీల్లో 200 లారీలు ఓపెన్‌కాస్టు బొగ్గుగనుల్లో భూములు కోల్పోయిన నిర్వాసితులు కొనుగోలు చేసి తిప్పుతున్నారు. కొన్నేళ్లుగా బొగ్గు లోడింగ్ సరిగా లేక, బొగ్గు రైల్వేలైను ద్వారా తరలించటం, కిరాయిలు సక్రమంగా లేకపోవటంతో లారీలు అమ్ముకున్నారు. మిగిలిన లారీ యజమానులు కూడా కిరాయిలు సక్రమంగా లేక ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారు. తమకు బొగ్గు లోడింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లారీ టిప్పర్ యజమానుల సంఘం ఆధ్వర్యంలో పలు పర్యాయాలు ఆందోళనలు కూడా జరిగాయి. ఆర్‌సీహెచ్‌పీకి రోడ్డు మార్గంలో తరలిస్తున్న బొగ్గు రవాణా ఆపాలని బుధవారం లారీ యజమానులు ఆందోళన చేశారు. దీంతో కాకినాడకు లోడింగ్ పెంచుతామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో గతంలో కాకినాడకు నిలిచిపోయిన బొగ్గురవాణాను పునరుద్ధరించటంతో కిరాయిలు వస్తాయని లారీ యజమానులు అంటున్నారు.

రోజుకు మూడు వేల టన్నులు రవాణా

కిష్టారం ఓసీ నుంచి కాకినాడకు రోజుకు మూడు వేల టన్నుల బొగ్గును వంద లారీల్లో ప్రస్తుతం రవాణా చేస్తున్నారు. ప్రస్తుతం కిష్టారం ఓసీ నుంచి రోజుకు 12వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతోంది. రానున్న రోజుల్లో రోజుకు అయిదు వేల టన్నులు కూడా ఇస్తామని కిష్టారం ఓసీ అధికారులు చెపుతున్నారు.

టన్నుకు రూ.10 కిరాయి తగ్గింపు

సత్తుపల్లి నుంచి కాకినాడకు బొగ్గు రవాణాకు గతంలో టన్నుకు రూ.795లు చొప్పున కిరాయి చెల్లించే వారు. కాని ప్రస్తుతం కిరాయి టన్నుకు రూ.పది తగ్గించి రూ.785లు మధ్యవర్తులు చెల్లిస్తున్నారు. దీంతో ఒక్కో లారీకి సగటున 30 టన్నులు లోడ్ అయితే కిరాయిలో రూ.మూడొందల వరకూ నష్టపోవాల్సి వస్తోందని కొందరు లారీ యజమానులు వాపోతున్నారు. ఖర్చులు పెరిగాయంటూ మధ్యవర్తులు టన్నుకు రూ.పది కిరాయిలో కోత పెట్టటం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఏడాది క్రితం కాకినాడకు బొగ్గు రవాణా నిలిచిపోయే వరకూ టన్నుకు రూ.795లు చెల్లించగా కిరాయి పెరగాల్సింది పోయి తగ్గటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీలకు కిరాయిలు దక్కక ఆందోళనలో ఉన్న యజమానుల బలహీనతలను కొందరు సొమ్ము చేసుకుంటున్నారని కొందరు యజమానులు పెదవి విరుస్తున్నారు. అయినా బొగ్గు లోడింగ్ కిరాయి దొరికిందని సరిపెట్టుకుంటున్నారు.

ఫలించిన ప్రజాప్రతినిధుల కృషి

సత్తుపల్లిలో లారీ యజమానులు కిరాయిలు లేక, బొగ్గు లోడింగ్ ఆశించిన స్థాయిలో దక్కక ఇబ్బందులు పడుతుండగా సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి గతంలో స్థానిక లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వాలని సింగరేణి ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల లారీ యజమానుల సంఘం బాధ్యులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలసి సమస్యను వివరించారు. కాకినాడకు బొగ్గు రవాణా పునరుద్ధరిస్తే కొంత వరకూ మేలు జరుగుతుందని మంత్రి దృష్టికి తీసికెళ్లగా మంత్రి తుమ్మల, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణి అధికారులతో మాట్లాడి కాకినాడకు బొగ్గు రవాణా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో సమస్య కొలిక్కి వచ్చి నాలుగు రోజుల క్రితం బొగ్గు రవాణా ప్రారంభమైంది.

'పీఎం కుసుమ్' ద్వారా

సోలార్ విద్యుత్ యూనిట్లు

ఐటీడీఏ పీవో రాహుల్



మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో 'పీఎం కుసుమ్' పథకం ద్వారా సోలార్ విద్యుత్ యూనిట్లను గిరిజనుల పంట పొలాల్లో నెలకొల్పేందుకు స్వయం సహాయక గ్రూపులను గుర్తించి ఆర్థికంగా వెసులుబాటు కల్పించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. గురువారం పీవో అటవీ, కరెంటు, వ్యవసాయం, రెవెన్యూ, ఐకేపీ అధికారులతో సమన్వయంగా సబ్‌స్టేషన్ నుంచి మూడు కి.మీ. పరిధిలో ఉన్న పోడు భూములకు సంబంధించి గిరిజన రైతుల భూములను గుర్తించి సోలార్ విద్యుత్ యూనిట్లను నెలకొల్పే విధంగా పూర్తిస్థాయిలో సర్వే చేసి త్వరితగతిన ప్రతిపాదనలు అందజేయాలన్నారు. మెగావాట్ విద్యుత్ ప్లాంటు నిర్మాణానికి స్వయం సహాయక సంఘాల మహిళలకు 90 శాతం బ్యాంకు రుణం లభిస్తుందని 10 శాతం లబ్ధిదారుల వాటా ఉంటుందన్నారు. ఒక మెగావాట్ ప్లాంట్ నుంచి ఏడాదికి సగటున 15లక్షల యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని దీని ద్వారా రూ.45 లక్షల ఆదాయం వస్తుందన్నారు. ప్లాంటు నిర్వహణ బ్యాంకు రుణం వడ్డీలు కలిపి సుమారు రూ.20 లక్షలు ఖర్చులు పోను మరో రూ.25 లక్షలు మిగులుతాయని పేర్కొన్నారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం గిరిజన రైతుల పంట పొలాలకు సరిపడా విద్యుత్ అందించి రెండు పంటలు పండించడానికి దోహదపడవచ్చని పేర్కొన్నానారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, జీఎం మహేందర్‌రెడ్డి, ఎస్వో భాస్కరన్, డీటీఆర్‌పీఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, ఏపీవో పవర్ ఏఈ మునీర్‌పాషా పాల్గొన్నారు.

సమష్టి కృషి ఫలితమే ఈ విజయం

» కేటీపీఎస్ 5,6 దశల సీఈ ప్రభాకరరావు » ఉద్యోగులకు అభినందనలు



సీఈని అభినందిస్తున్న పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు

పాల్వంచ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేటీపీఎస్ 6వ దశ 500 మెగావాట్ల యూనిట్-11 నిర్విరామంగా 100 రోజుల పాటు కొనసాగుతూ కొత్త మైలురాయిని దాటడం అందరి విజయమని, సమష్టి కృషితోనే ఇది సాధ్యమని కేటీపీఎస్ 5,6 దశల సీఈ ప్రభాకరరావు అన్నారు. 6వ దశ 100 రోజుల మైలురాయిని దాటిన తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం సీఈ ప్రభాకరరావును మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం పూలమొక్కను బహుకరించి ఆయనను ఘనంగా సత్కరించారు. సీఈ ప్రభాకరరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇంజనీర్లు, కార్మికులు కష్టపడి పనిచేసి కేటీపీఎస్ 5,6 దశలకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ బ్రాంచి కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ చంద్రకళాధర్, సభ్యులు శ్రీనివాసరావు, రాంబాబు, పావని, శ్రీలక్ష్మి, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు తక్షణ న్యాయం

» మంత్రి తుమ్మల » రైల్వే మూడో లైన్ నిర్వాసితులకు ఇళ్ల పట్టాల అందజేత



నిర్వాసిత మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం తమ నివాసాలు, భూములను అందించిన నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి తక్షణ సహాయం అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మంలోని రైల్వే మూడోలైన్ భూ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ 58 మంది బాధితులకు 75 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చామని, అధికారులు స్పందించి భూ నిర్వాసితులకు వెంటనే ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేకంగా మోడల్ కాలనీ నిర్మాణం చేసి అన్ని వసతులు, తాగునీరు, విద్యుత్ సరఫరా, వీధి లైట్లు, రహదారుల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. భూ నిర్వాసితుల కుటుంబాల్లోని విద్యార్థులకు యంగ్ ఇండియా పాఠశాలలో అడ్మిషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం అందించిన పరిహారం డబ్బులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ భూ నిర్వాసితులకు అందించిన ప్యాకేజీలను వివరించారు. ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, స్థానిక మాజీ ఎంపీటీసీ యర్రగర్ల హనుమంతరావు, కార్పొరేటర్ కమర్తపు మురళీ, సాధు రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్గీకరణపై ఎస్సీ కమిషన్‌కు వినతి

» ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం » అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను బీఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ విరుద్ధమని కుల వివక్షత ఆధారంగా షెడ్యూల్డ్ కులాల్లోని 1227 కులాల జాబితాతో ఆధిపత్య కులాలతో సమానమైన అభివృద్ధిని సాధించేందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా 15% రిజర్వేషన్లను కల్పించారని ఈ రిజర్వేషన్లు ఎస్సీ లోని అన్ని కులాలు ప్రతిభ ఆధారంగా లబ్ధిపొందాల్సి ఉందన్నారు. ఈ రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఎస్సీ లోని ఆయా కులాలు వెనుకబాటుకు ఎస్సీ కులాలు కారణం కాదని ఎస్సీ లోని వెనుకబడిన ఆయా కులాల వారికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీల ద్వారా నిర్బంధ విద్య వైద్యం ఉపాధి పలు శిక్షణలతో కూడిన వసతి సదుపాయాలతో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నదని లింగాల తెలిపారు.

వర్గీకరణను వెంటనే చేపట్టాలి

పెనుబల్లి, (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేయాలని కోరుతూ గురువారం ఎంఎస్పీ నాయకులు ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఎంఎస్పీ నాయకుడు కొలికపోగు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ వెంటనే చేపట్టాలని కమిషన్‌ను కోరారు.

మన ఆరోగ్యాన్ని మనమే సంరక్షించుకోవాలి

ఆటో డ్రైవర్ల వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'మన ఆరోగ్యాన్ని మనమే సంరక్షించుకోవాలి.. ఆటో డ్రైవర్లు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు త్వరలో యోగా తరగతుల నిర్వహణ కోసం కూడా చర్యలు తీసుకుంటాము' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం నగరంలో ఆటో ఆటో డ్రైవర్లకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాలను కలెక్టర్ ప్రారంభించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఒత్తిడి తగ్గించుకునేందుకు ఒక బ్యాచ్ యోగా తరగతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, జనవరిలోపు వారానికి 3 యోగా క్లాస్‌లు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. యోగాలో నేర్చుకున్న అంశాలను ఆటో డ్రైవర్లు రెగ్యులర్‌గా ఫాలో కావాలన్నారు. ఆటోరిక్షా కార్మికులకు ఖమ్మం జిల్లాలో ప్రత్యేకంగా 2 రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, నగరంలో భక్త రామదాసు కళాక్షేత్రం, నయాబజార్ హైస్కూల్ గ్రౌండ్, ఆర్టీఓ కార్యాలయంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. డ్రైవర్లు మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని, మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలని సూచించారు. ప్రత్యేక వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, కంటి, తదితర అంశాల్లో ఆటో డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, డీసీహెచ్ఎస్. డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

అన్నారుగూడెం యువకుడికి అమెరికాలో డాక్టరేట్



శ్రీనివాస్

తల్లాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అమెరికా టెక్సాస్ రాష్ట్రంలోని యూనివర్సిటీ ఆఫ్ కుంబర్ ల్యాండ్స్ నందు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన చీకటి శ్రీనివాస్ 2024 పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేటర్ సాధించారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, శాంతమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాస్ 2014నుంచి 2016వరకు టెక్సాస్ స్టేట్ ఆఫ్ రియో గ్రాండ్ వ్యాలీ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తిచేసి అక్కడే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించాడు. అనంతరం 2019 నుంచి 2024వరకు పీహెచ్‌డీ కూడా పూర్తిచే శాడు.



బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

తిరుమలాయపాలెం, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బచ్చోడు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటుచేయాలని ఇల్లెందు మాజీఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం మండలంలోని బచ్చోడులో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం వాటిని విస్మరించారన్నారు. ఇల్లెందు, పాలేరులను రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మిడి హనుమంతరావు, జక్కుల యాదగిరి, వెన్నబోయిన వెంకటరమణ, జి.దరగయ్య, జి.రాంబాబు, ఉపేందర్‌రెడ్డి, వీరబాబు, శ్రీకాంత్, రంజిత్, శ్రీను పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	30 రూ.
వంకాయ	28
గుత్తి వంకాయ	38
బీరకాయ	58
పచ్చిమిర్చి	28
కాకరకాయ	28
బెండకాయ	38
పొట్లకాయ	48
దోసకాయ	24-38
చిక్కుడు	38
నాటుచిక్కుడు	88
గోరుచిక్కుడు	34
క్యాబేజీ	24
దొండ	34-40
సొరకాయ	18
క్యారెట్	58
క్యాప్సికం	64
ఆలుగడ్డ	36
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్



రహదారి శంకుస్థాపనలో మంత్రి తుమ్మల, మేయర్ పునుకొల్లు నీరజ

భవిష్యత్ దృష్టితో అభివృద్ధి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 32, 36 డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): రాబోయే 50ఏళ్ల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఖమ్మం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ఇప్పటికే చేపట్టిన పనులను ఉగాది నాటికి పూర్తి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని 32, 36 డివిజన్లలో మొత్తం రూ.3కోట్ల పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. డ్రెయినేజీలు ఏటవాలుగా ఉండాలని, పైపు లైన్ పనులు నాణ్యతగా చేపట్టాలని, పది కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడే విదంగా క్వాలిటీగా పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ పనికి మూడు నెలల కాలం పెట్టుకొని కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని అధికారులకు మార్గదర్శకం చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతోనే ఇంతటి అభివృద్ధి జరుగుతుందని వివరించారు. మున్సిపల్ కమిషనర్ అభిషేక్‌అగస్త్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు విద్యార్థులు
నిర్విరామంగా కృషి చేయాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాల సాధనకు విద్యార్థులు నిర్విరామంగా కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం నయాబజార్ జూనియర్ కళాశాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మున్నేరు వరదల్లో సర్వసం కోల్పోయిన విద్యాసంస్థలకు రూ.3.87లక్షల పనులను కలెక్టర్, రోటరీ క్లబ్ గవర్నర్ కే.శరత్ చౌదరి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో 20 అడుగుల వరద వస్తే ఈ ఏడాది 40అడుగల వరద వచ్చిందన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, స్వచ్ఛందంగా వచ్చి పని చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాది వాసుదేవ్, పి. సాంబశివరావు, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు విసిరెడ్డి, బాల కోటి రెడ్డి, డిప్యూటీ గవర్నర్ దొడ్డపనేని సాంబశివరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ రామారావు, అధ్యాపకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పన

వసతి గృహంలో ఉండి చదివే పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం నయాబజార్ లోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహానికి ఉన్న అత్యవసర అంశాలపై నివేదిక అందించాలని వసతి గృహ వార్డెన్ సైదులుకు సూచించారు. మరమ్మతులు,దోమలతెర, పెయింటింగ్ మొదలగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు.వసతిగృహంలోనివిద్యార్థులకు బంకర్ బెడ్స్ అందించేందుకు టెండర్లు పిలవాలని, పిల్లలకు బ్లాంకెట్‌లు అందిస్తామన్నారు.

సినిమా
CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	పుష్ప 2
శ్రీనివాస:	పుష్ప 2
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	పుష్ప 2

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

నేలకొండపల్లి, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, తద్వారా అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీడీఓ యర్రయ్య అన్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి టాలెంట్‌టెస్టును ప్రారంభించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రవి, గోవిందరావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

బదిలీల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల స్పౌజ్ బదిలీల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏవి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి తీరుపై కలెక్టర్‌కు, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు వినతిపత్రాలు అందించారు. ప్రమోషన్లలో ఎన్‌సీసీ రిజర్వేషన్లు లేనప్పటికీ డీఈవోకు అనుకూలంగా ఉన్న వారికి అదే పాఠశాలలో (ఆన్‌లైన్లో చూపకుండా) పోస్టింగ్‌లు ఇవ్వటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

యూటీఎఫ్ సభలను జయప్రదం చేయండి

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా విద్యా మహా సభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు.

పాలేరులో నేడు మంత్రి పొంగులేటి పర్యటన

కూసుమంచి, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 9:30కు కూసుమంచిలో ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. 10:30కు ఖమ్మంరూరల్ మండలం కొండాపురం, 11గంటలకు గొల్లగూడెం, 11:30కు ఆటోనగర్, 12గంటలకు శ్రీరాంనగర్, 12:30కు ఇందిరమ్మకాలనీ, 1:00గంటకు సాయి గణేష్‌నగర్‌లో పర్యటిస్తారు. మధ్యాహ్నం 3:30కు తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి, 4:00కు బీరోలు, 4:30కు బచ్చోడుతండా, 5:00కు బచ్చోడు, 5:30కు హస్నాబాద్, 6:00 సుబ్లేడు, 6:30కు పాతర్లపాడు గ్రామాల్లో పర్యటిస్తారు. ఆయా గ్రామాలకు మంజూరయిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంఖానాపురంహవేలి డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): మినిమం టైమ్ స్కేల్, రెగ్యులరైజేషన్ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.న్యాయమైన వారి డిమాండ్లను పరిష్కారించాలని కోరారు.

ఖానాపురం అలుగుకు మహర్దశ

- ఊరచెర్వు నుంచి మున్నేరు వరకు భారీగా విస్తరణ
- ఖమ్మంలోని మైదాన ప్రాంతాలకు తప్పనున్న వరద గండం
- పనులు ప్రారంభానికి సిద్ధమైన అధికారులు



అలుగు నూతన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు1న కురిసిన భారీ వర్షాలకు మున్నేరు పరివాహక ప్రాంతంతో పాటుగా ఖమ్మంలోని మైదాన ప్రాంతాలు భారీగా ముంపునకు గురయ్యాయి. మంత్రి తుమ్మల చొరవతో మున్నేరు పరివాహక ప్రాంతం, మైదానప్రాంతాల్లో వరద ముంపుపై చర్యలు చేపట్టారు. ప్రజలకు ప్రాణ, ఆస్థి నష్టం లేకుండా చేశారు. మంత్రి తుమ్మల సూచనలతో మైదాన ప్రాంతంలోని వరద ముంపు నుంచి భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అధికారులు కసరత్తు చేశారు. ఖానాపురం ఊరచెర్వు నుంచి మున్నేరు వాగు వరకు వ్యాపించి ఉన్న ఖానాపురం అలుగు వెడల్పుకు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. భవిష్యత్‌లో ఎంత వర్షాలు, వరదలు వచ్చినా ప్రజల నివాసాల్లోకి వరద రాకుండా ఖానాపురం అలుగు వెడల్పు నూతన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. రఘునాథపాలెం మండలంలో వర్షపు నీటితో పాటుగా బల్లేపల్లి, బాలపేట, పాండురంగాపురం వరద నీరు ఖానాపురం ఊరచెర్వుకు చేరుతోంది. అందుకే బల్లేపల్లి వద్ద అలుగు వెడల్పును పైభాగంలో 11మీటర్లు, అక్కడ నుంచి ఖానాపురం ఊరచెర్వు తర్వాత అలుగు వెడల్పును 17మీటర్లు పెంచారు. ఇదే అలుగు ఖమ్మం బైపాస్ రోడ్డు వద్దకు రాగానే ప్రవాహం పెరగటంతో అలుగు వెడల్పును పెంచారు. అక్కడ అలుగు 26మీటర్లుగా నిర్ధారించారు.ఈ అలుగు ధంసలాపురం చెర్వువద్దకు వెళ్లేవరకు 41మీటర్లుగా పెంచారు. దీంతో రఘునాథపాలెం మండలం నుంచి ఖానాపురం ఊరచెర్వు, ఖమ్మంలో మున్నేరు వరకు ఎక్కడా వరద పోటు రాకుండా కార్యచరణ చేశారు.

డ్రెయినేజీకి ప్రత్యేక పైపు లైన్

అలుగు వెంటనే ప్రత్యేకంగా అండర్ డ్రెయినేజీ పైప్‌లైన్‌కు అధికారులు కార్యచరణ సిద్ధం చేశారు. అలుగు ప్రవహించే ప్రాంతాల సమీపంలోని డ్రెయినేజీ నీరు అలుగులోకి ప్రవహించకుండా పైప్‌లైన్ నిర్మాణం చేయనున్నారు. దీంతో ఖమ్మం మైదాన ప్రాంతంలో భారీ వరదల ముంపు గండం తప్పనుంది.

వర్గీకరణతో అన్ని కులాలకు న్యాయం జరగాలి

టీపీసీసీ మాజీ కార్యదర్శి

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): వర్గీకరణతో ఎస్సీలోని అన్ని కులాలకు న్యాయంజరగాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ కార్యదర్శి వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ తీర్పును స్వాగతిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీవర్గీకరణ ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటుచేసి జిల్లాల వారీగా సలహాలు, సూచనలు స్వీకరించడం అభినందనీయమన్నారు. రాష్ట్రజనాభాలో ఎస్సీలోని 59 ఉపకులాలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ శాతం కలిపించాలన్నారు. ఈ సమావేశంలో కస్తాల క్రాంతి కుమార్, తోళ్ల రాకేష్ పాల్గొన్నారు.

రామయ్యకు నివాళి

తిరుమలాయపాలెం, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ నేత,మాజీ ఎంపీపీ ఊడుగు రామయ్యకు బీఆర్‌ఎస్‌జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ గురువారం ఘననివాళులర్పించారు. కొక్కిరేణి గ్రామానికి చెందిన రామయ్య ఇటీవల మృతి చెందారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్‌ఎస్ నాయకులు చావా వేణు, వీరన్న, బోడ మంచానాయక్, ధరావత్ శంకర్, ధరావత్ రవి, వెంకటేశ్వర్లు, ఎస్కే చాంద్‌పాషా నివాళులర్పించారు.

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న మున్సిపల్(పట్టణ)స్థాయి సీఎంకప్ క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు పోటీలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. గురువారం కబడ్డీ, ఖో-ఖో, ఉషూ, స్విమ్మింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలను మున్సిపల్ మేనేజర్ విజయానంద్ క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నర్సింహమూర్తి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, వాలీబాల్ కోచ్ అక్బర్‌అలీ ఉన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న తహసీల్దార్

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

తిరుమలాయపాలెం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ప్రతిభ చాటాలని తహసీల్దార్ పీవీ రామకృష్ణ అన్నారు. తిరుమలాయపాలెం జిల్లాపరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎంకప్ మండలస్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. విజేతలకు ఎంపీడీవో సిలార్‌సాహెబ్, తహసీల్దార్ రామకృష్ణ బహుమతులు అందించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, ఉత్తమ ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర రెడ్డి, హెచ్‌ఎం విజయకుమారి, గంగాప్రసాద్, పీడీలు సుజాత, రాజేశ్వరి, షబానా తదితరులు పాల్గొన్నారు

'భూమాత' దరఖాస్తులను పరిష్కరించాలి

ఖమ్మంటౌన్,డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): భూమాత చట్టాన్ని(ధరణి) ఆమోదించి ప్రజాపాలనలో వచ్చిన భూదరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రైతసంఘం (సీపీఎం) ఆధ్వర్యంలో గురువారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుత శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నందున సమస్యలపై చర్చించి పరిష్కారం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ తెలంగాణ రైతుసంఘం నాయకులు యర్రబోయిన గోవిందరావు, కూసుపుడి మధు, సీఐటీయూ రాష్ట్రనాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లానాయకులు ఎస్కే మీరా, నాగేశ్వరరావు,కార్మికసంఘం నాయకులు బత్తిని ఉపేందర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేలకొండపల్లి ఓటర్లు 49,919 మంది

- పోలింగ్ స్టేషన్లు మొత్తం 300
- వివరాలు వెల్లడించిన ఎంపీడీవో
- నెలాఖరు వరకు ఓటర్ల నమోదుకు అవకాశం

నేలకొండపల్లి, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓటర్లు 49,919మందిగా అధికారులు ప్రకటించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ ఓటర్ల వివరాలను ప్రకటించారు. అధికారులు ప్రకటించిన ఓటర్లలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మహిళా ఓటర్లు 26,053 మంది కాగా, పురుష ఓటర్లు 23,865 మందిగా తేల్చారు. మహిళా ఓటర్లు 2188 మంది ఎక్కువగా ఉన్నారు. ఇతరులు ఒకరు ఓటరుగా నమోదు చేయించుకున్నారు. గత ఎన్నికల కంటే ప్రస్తుతం 760 మంది ఎక్కువగా ఓటర్లున్నారు. ఈనెలాఖరు వరకు ఓటర్లుగా నమోదు చేయించుకునే అవకాశం ఉందని ఎంపీడీఓ చెప్పారు. కొత్తగా నమోదయ్యే ఓటర్ల ను తుది జాబితాలో చేర్చుతామన్నారు.

300 వార్డులు, 300 పోలింగ్ స్టేషన్లు

మొత్తం పంచాయతీల్లో 300 వార్డులుండగా 300 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. 200 ఓట్లకు 218 పోలింగ్ స్టేషన్లు, 201 నుంచి 400 ఓట్ల వరకు 68, 400పైన 14 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు. గతంలో నేలకొండపల్లిలో 1నుంచి9 వార్డులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ, 10నుంచి14వరకు తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న ఎన్నెస్పీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం 1నుంచి 9 పోలింగ్ స్టేషన్ల వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ 10నుంచి14వరకు సింగారెడ్డిపాలెం పీఎస్‌లోనూ ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశంలో ఉన్నం బ్రహ్మయ్య, కర్నాటి భానుప్రసాద్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజని, యంపీఓ శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుపతమ్మ, గోపయ్య కల్యాణం



ఖమ్మంసాంస్కృతికం డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం గాంధీచౌక్‌లోని షిరిడీసాయి మందిరంలో గురువారం పెనుగంచిప్రోలు తిరుపతమ్మ, గోపయ్య కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. పెనుగంచిప్రోలు నుంచి తీసుకు వచ్చిన విగ్రహాలను, ఆలయ అర్చకులను సాయిబాబా దేవాలయ నిర్వాహకులు వేములపల్లి వెంకటేశ్వరరావు దంపతులు స్వాగతించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఘనంగా ఇరుముడి మహోత్సవం

కామేపల్లి, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గరిడేపల్లి గ్రామంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. 70మంది స్వాములు ఇరుముడి కట్టారు. అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గింజల నర్సింహరెడ్డి, దమ్మలపాటి సత్యనారాయణ, గుజ్జర్లపుడి రాంబాబు గ్రామస్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సెమీ క్రిస్మస్ వేడుకలు

కామేపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిపారు. గురువారం ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ నెల్లూరి చందన ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. రోగులకు, వృద్ధులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌ఓ సుధారాణి, హెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, స్టాఫ్‌నర్సులు పుష్పలత, దీనకుమారి, హెచెస్ లక్ష్మి, నరేంద్ర, రాధక్రిష్ణ, ఎల్టీ ఉమమహేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నాల్గోతరగతి ఉద్యోగ్యోల ఆధ్వర్యంలో రేపు ..

ఖమ్మంకలెక్టరేట్: తెలంగాణ నాల్గోతరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14న సెమీక్రిస్మస్ వేడుకలు ఇందిరానగర్ సంఘం కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కె.వెంకటరమణ, బిక్కు తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులు, నగరశాఖ కార్యవర్గ సభ్యులు, డిపార్టుమెంటు యూనిట్ల కార్యవర్గం, మహిళా కార్యవర్గ సభ్యులు అన్ని శాఖలలో పని చేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగులు పాల్గొనాలని వారు కోరారు.

కోటమైసమ్మ హుండీ ఆదాయం రూ.32వేలు

కామేపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్త లింగాలలోని కోటమైసమ్మఅమ్మవారి హుండీ ఆదాయం రూ.32901 వచ్చిందని ఖమ్మం డివిజన్ దేవదాయ పరిశీలకుడు అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. లెక్కింపులో కార్యనిర్వహణ అధికారి నల్లమోతు శేషయ్య, జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఏడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- జీవో నెంబర్ 60 మేరకు వేతన సవరణ చేపట్టాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మెప్మా ఆర్పీల వినతి

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏడు నెలల నుంచి వేతనాలు ఇవ్వటం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఖమ్మం ఆర్పీలు వినతిపత్రం అందించి తమ సమస్యలను తెలిపారు. సమగ్ర ఇంటింటి సర్వే, ప్రజాపాలన ఇలా మున్సిపాలిటీల్లో ఎటువంటి ప్రభుత్వ సర్వేలు, పనులు ఉన్నా మెప్మాలోని రిసోర్స్ పర్సన్‌లకు అధికారులు బాధ్యతలు కేటాయిస్తున్నారని, అదనంగా ప్రోత్సహకాలు ఇవ్వకున్నా పనులు చేస్తున్నామని చెప్పారు. గురువారం కేఎంసీకి వచ్చిన మంత్రి తుమ్మలను ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు రాగం ఉషా ఆధ్వర్యంలో కలిసి తమ సమస్యలను విన్నవించారు. జీవో నెంబరు60 మేరకు వేతన సవరణ చేపట్టాలని, ప్రభుత్వం అదనంగా అప్పగించే పనులకు కనీస ప్రోత్సహకం ఇవ్వాలని కోరారు. మహిళలను ఆర్థికంగా బలోపేతానికి కృషి చేస్తున్న ఆర్పీలు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లారని వివరించారు.నాయకులు జీ పద్మ, లక్ష్మీదుర్గా, స్వరూప, ఝాన్సీ, విజయలక్ష్మీ, నాగమణి, సరిత, సుభద్ర, రజిని, శోభ, వెంకటదుర్గా, ఉషారాణి,సీతమ్మ,సమీరా, ప్రవీణ, చంద్రకళ, కళ్యాణి, ఉషారాణి పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందిస్తున్న ఆర్పీలు

శిథిలావస్థలో పాలవాగు కల్వర్టు

» రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
» నూతన కల్వర్టును నిర్మించాలని అన్నదాతల వినతి



డొంక రోడ్డుపై ప్రవహిస్తున్న పాలవాగు

మధిర రూరల్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం నక్కలగరుబు(బుచ్చిరెడ్డిపాలెం)-వంగవీడు గ్రామాల మధ్య పాలవాగుపై నిర్మించిన కల్వర్టు శిథిలమైంది. దీంతో ఈ డొంక రోడ్డులో వాగు దాటుకుంటూ పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2004వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అంటే 20సంవత్సరాల క్రితం ఈ రెండు గ్రామాల మధ్య డొంక రోడ్డులో పాలవాగుపై రూ.మూడు లక్షలతో కల్వర్టు నిర్మించారు. ఆనాడు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ 70శాతం మేరే నిర్మించి మిగతా 30శాతం మేర పనులు చేయకుండా వదిలేశారు. బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రైతులకు ఎక్కువమందికి ఈ రహదారి గుండానే పొలాలు ఉన్నాయి. నిత్యం ట్రాక్టర్లు, ఎద్దులు, అరకలతో ఈ వాగు కల్వర్టుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి కీలకమైన ఈ డొంక రోడ్డు కల్వర్టు శిథిలం కావడం, డొంక రోడ్డు కూడా చెట్లతో నిండిపోవడంతో అటుగా వెళ్లే రైతులు నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలోనైతే వీరు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. చుట్టూ ఐదారుకిలోమీటర్లు తిరిగి వంగవీడు మీదుగా పొలాలకు వెళ్తుంటారు. కాగా ఈ మధ్యలో ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ వాగుపై కల్వర్టు నిర్మాణం గురించి పట్టించుకొనే వారే కరువయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ పాలవాగుపై మినీ వంతెన నిర్మాణం చేపట్టి రెండువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేసేలా నిధులు మంజూరు చేయాలని, బుచ్చిరెడ్డిపాలెం రైతులకు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం..
•సంపసాల ముత్తయ్య, రైతు, బుచ్చిరెడ్డిపాలెం



తమ గ్రామానికి చెందిన రైతుల పొలాలన్నీ పాలవాగు మీదుగా వెళ్లే డొంక రోడ్డులోనే ఉన్నాయి. సంవత్సరంలో 8నెలలపాటు పాలవాగు ప్రవహిస్తూనే ఉంటుంది. తాము ఎడ్లబండ్లు, అరకలతో పొలాలకు వెళ్లాలంటే వాగుపై కల్వర్టు లేక నరకయాతన పడుతున్నాం. ప్రజాప్రతినిధులు స్పందించి మినీ వంతెన నిర్మాణం చేపట్టాలి.

కల్వర్టును నిర్మించాలి
• జోనెబోయిన లక్ష్మయ్య, రైతు, బుచ్చిరెడ్డిపాలెం



పొలాలకు వెళ్లేందుకు డొంక దారి సరిగా లేకపోవడంతో పొలాల్లో పండిన వ్యవసాయ ఉత్పత్తులను ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా ఇళ్లకు చేరవేసుకోవాలంటే రైతులందరం ఇబ్బందులు పడుతున్నాం. పాలవాగుపై కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వ అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలి.

సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి

» ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

సత్తుపల్లి, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు తమ సామర్థ్యాలను పరీక్షించుకుంటూ తరగతి గదిలోనే తమ సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని ఆర్జేడీ కే.సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బీ.గంగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను ఆయన ఆవిష్కరించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. టాలెంట్ టెస్టుల ద్వారా పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చాన్నారు. 100శాతం ఫలితాలు సాధించాలని, అందుకోసం ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.జయరాజు, ఉపాధ్యాయులు బీ.మాధవి, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను అందించడమే ధ్యేయం

» కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూరంపల్లి రామారావు



మాట్లాడుతున్న సూరంపల్లి రామారావు

కొణిజర్ల, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చే కార్యక్రమం చేపట్టిందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు తెలిపారు. గురువారం కొణిజర్లలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల పై సర్వే జరుగుతుందని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్ని అమలు చేస్తుందని అన్నారు. ఇప్పటికే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ, మహిళకు ఉచిత బస్ సౌకర్యం, ధాన్యం రైతులకు బోనస్ ఇవ్వడం జరిగిందన్నారు. ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిందని, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

అంగన్‌వాడీల అక్రమ అరెస్టుకు సీపీఎం ఖండన



మాట్లాడుతున్న సర్వేశ్వరరావు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని సీఐటీయూ జిల్లా నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ముందస్తుగా అరెస్టైన వారిలో పెరిక ఉదయశ్రీ, నాగేంద్ర, రామేశ్వరి, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

'బస్సుల సంఖ్యను పెంచాలి'

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణానికి తగ్గట్లుగా బస్సుల రద్దీని పెంచాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సంస్థను డిమాండ్ చేసింది. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేశారు. పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో చావా కవిత, ప్రభావతి, సత్యవతి, కళావతి, సీతపాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ



ఫ్రీజర్ బాక్స్‌ను అందజేస్తున్న దాత తిరపయ్య

ముదిగొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాధాపురం గ్రామపంచాయతీకి ఫ్రీజర్ బాక్స్‌ను గ్రామానికి చెందిన పిల్లలమర్రి భారతమ్మ జ్ఞాపకార్థం భర్త తిరపయ్య పద్మశాలిల సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళీ చేతులమీదుగా గురువారం అందజేశారు. ఫ్రీజర్ బాక్సు అందజేయడం పట్ల గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకమర్రి శ్రీనివాసబాబు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బండారు శ్రీను, సత్యనారాయణ, సంపత్ పాల్గొన్నారు.

'మాస్టీన్ కులాన్ని ఎస్సీ'ఏ'గా మార్చాలి'

వైరా, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాస్టీన్ కులసంఘాన్ని ఎస్సీ ఏలోకి మార్చాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు ఖమ్మం జిల్లా ఆ కులసంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఆసంఘం నాయకులు కలిశారు. మాస్టీన్ కులం వారు ఖమ్మం జిల్లాలో పదివేల మందికి పైగా ఉన్నారని, తాము ఎస్సీ మాదిగ-బీగా సీరియల్ నెంబర్ 32లో ఉన్నామని తెలిపారు. తమ కులం అన్నివిధాలుగా వెనుకబడి ఉన్నందున ఎస్సీ ఏలోకి మార్చాలని కమిషనర్‌కు సమర్పించిన వినతిపత్రంలో కోరారు. ఆసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేళ్ల ప్రసాద్, మన్నెం సత్యానందం, నాయకులు మన్నెం కనకయ్య, దర్శనం నాగేశ్వరరావు, నాగేళ్ల రాకేష్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీవో కిషోర్

ముదిగొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు సంబంధించి గురువారం స్థానిక మండపరిషత్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో ఎంపీవో వాల్మీకి కిషోర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 246పోలింగ్ బూతులను గుర్తించామని తెలిపారు. జడ్పీఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలన్నీ ఒకే పరిధిలో ఉండేవిధంగా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కొమ్మినేని రమేష్‌బాబు, మంకెన దామోదర్, బంకా మల్లయ్య, కోలేటి వీరయ్య, కనపర్తి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వాహణ పై ఎంపీడీవో బి.సురేందర్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయపార్టీలు నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాపై అనుమానలు, అభ్యంతరాలపై సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 31గ్రామపంచాయతీల్లో 284 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలం మొత్తంలో 40,243మంది ఓటర్లతో తుది జాబితాను ఖరారు చేశామని తెలిపారు. అనంతరం ఎంపీవో గంధం శ్రీలక్ష్మిని నాయకులు సన్మానించారు.

రసవత్తరంగా సీఎం కప్ క్రీడలు



వైరాలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మునిసిపల్ చైర్మన్, కమిషనర్

వైరా, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): వైరాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సీఎం కప్ క్రీడాపోటీలను నిర్వహించారు. వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ క్రీడలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని కబడ్డీ ఆడి వారిని ప్రోత్సహించారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని జైపాల్ పేర్కొన్నారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, గురుకులం ప్రిన్సిపాల్ డి.సమత, హెల్త్ సూపర్‌వైజర్ అనంతరాములు పాల్గొన్నారు.

కల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో మండల స్థాయిలో జరిగిన సీఎం కప్ క్రీడా పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలను కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి, కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, ఎంపీడీవో చంద్రశేఖర్‌లు ప్రారంభించారు. ఈ పోటీలలో మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల నుంచి క్రీడాకారులు తరలి వచ్చి పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమంలో బోడా భీమా, వ్యాయామ ఉపాధ్యాయుడు వీరరాఘవయ్య, పీడీలు కే. రాధాకృష్ణ, జి. రమాదేవి, తివేణి, పద్మ, పాపారావు, పంచాయతీ ఈవో నందిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏన్కూరు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడాపోటీల్లో గెలుపొందిన జట్లకు గురువారం గురుకుల పాఠశాల వరణలో బహుమతులు అందించారు. బాలుర కబడ్డీలో గంగులనాచారం (ప్రథమ), కాలనీ నాచారం (ద్వితీయ), బాలికల కబడ్డీలో కేజీబీవీ ఏన్కూరు (ప్రథమ), జడ్పీహెచ్‌ఎస్ (ద్వితీయ)స్థానం సాధించారు. బాలుర ఖోఖోలో టీజీఆర్ఎస్ ఏన్కూరు (ప్రథమ), తిమ్మరావుపేట (ద్వితీయ), బాలికల ఖోఖోలో కేజీబీవీ (ప్రథమ), తిమ్మరావుపేట పంచాయతీ (ద్వితీయ), వాలీబాల్ బాలుర పోటీల్లో గంగులనాచారం (ప్రథమ), బీఎస్‌తండా (ద్వితీయ). వాలీబాల్ బాలికలలో కేజీబీవీ ఏన్కూరు (ప్రథమ), టీఎల్‌పేట (ద్వితీయ), స్థానం సాధించారు. గురుకుల పాఠశాల విద్యార్థులు అత్యధిక బహుమతులు సాధించారు. గెలుపొందిన జట్లకు మండల ప్రత్యేక అధికారి సాయినాథ్, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ శేషగిరిరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం కూరాకుల సైదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స్వర్ణనరేంద్రకుమార్, మేడ ధర్మారావు, వేముల రమేష్, గిద్దగిరి సత్యనారాయణ చేతులమీదుగా బహుమతులు అందించారు.



ఏన్కూర్‌లో విజేతలకు బహుమతులు అందిస్తున్న అధికారులు



కల్లూరులో సీఎం కప్ అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడా విజేతలు

వరికొయ్యలను కాల్చొద్దు

కారేపల్లి, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలను కాల్చడం వలన రైతులకు అనేక నష్టలు వాటిల్లే ప్రమాదం ఉందని ఏవో బట్టు అశోక్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అనేక గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. వరి కొయ్యలను అలాగేఉంచడంతో వర్షాకాలంలో వరికొయ్యలు మురిగిపోయి పంటలకు ఎరువుగా మారుతుందన్నారు. అందుకే రైతులు వరి కొయ్యలను కాల్చవద్దన్నారు.

సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శిగా వీరభద్రం



కొణిజర్ల, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం సింగరాయపాలెం గ్రామంలో జరిగిన వైరా మండల సీపీఎం 3వ మహాసభలో వైరా డివిజన్ కార్యదర్శిగా భూక్యా వీరభద్రాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతో పాటు 23 మంది కార్యవర్గంతో కమిటీని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. రాబోయే కాలంలో ప్రజల పక్షాన సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో డివిజన్ కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు డివిజన్ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని తెలిపారు.

మిరప తోటల పరిశీలన



మిరప తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఏన్కూరు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని భగవాన్‌నాయక్‌తండా గ్రామంలోని వైరా కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కే.రవికుమార్, ఉద్యానశాస్త్రవేత్త వి.చైతన్య గురువారం మిరప తోటలను పరిశీలించారు. మిరప తోటలకు ప్రస్తుతం అక్కడక్కడ తామర, కొమ్మకుళ్లు తెగుళ్లు ఆశించినట్లు తెలిపారు. వీటి నివారణకు నీలిరంగు జిగురు అట్టాలు అమర్చుకోవాలన్నారు. గ్రీజు పూసిన పసుపు రంగు పట్టాలను అమర్చడం వల్ల తెల్లదోమ ఉధ్రుతిని నివారించవచ్చని తెలిపా రు. ఈకార్యక్రమంలో ఏవో నరసింహారావు, ఏఈవో లహరి తదితరులు పాల్గొన్నారు.

'నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి'



ప్రతిజ్ఞ చేస్తున్న సింగరేణి అధికారులు

సత్తుపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను ప్రతిఒక్కరూ అధిగమించాలని కిష్టారం ఓసీ పీవో ఎంవీ. నరసింహారావు అన్నారు. గురువారం కిష్టారం ఓసీలో మల్టీ డిపార్టుమెంట్ టీం సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ అంకితభావంతో సమష్టి కృషితో నాణ్యత గల బొగ్గును ఉత్పత్తిచేసి వినియోగదారులకు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీజీఎం ఎస్.యోహాన్, కే.హనాసుమలత, బీ.శివకేశవరావు, కే.సూర్యనారాయణరాజు, టీ.రమణారావు, బీ.రామకృష్ణ, గోపీ కిషోర్, వీ.సందీప్ ఆయా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని ధర్నా



పోస్టుకార్డులు సీఎంవోకు పంపుతున్న రైతులు

తల్లాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతుల ఖాతాల్లో రూ.రెండులక్షల రుణమాఫీ వెంటనే జమచేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తల్లాడ రెవెన్యూ కార్యాలయం వద్ద తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ మాట్లాడుతూ రైతులు రూ.రెండులక్షల రుణమాఫీ కోసం నెలలతరబడి ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకుడు తాతా భాస్కర్‌రావు, సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ, మండల నాయకులు పులి వెంకటనర్సయ్య, శీలం పకీరమ్మ, కల్యాణం కృష్ణయ్య, నల్లమోతు మోహన్‌రావు, ఐనాల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

వైరా, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాంబాబు, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరు గురించి స్వయంగా ప్రజలతో మాట్లాడారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అర్హులైన పేదలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పకడ్బందీగా సర్వే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ చింతా వేణు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న అధికారులు రాంబాబు, శ్రీనివాసరావు

నాణ్యమైన బొగ్గును అందించాలి

సత్తుపల్లి, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి) : ఉత్పత్తి, ఉత్పాదకర వివరాలను తెలుసుకుని రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలని సింగరేణి డైరెక్టర్ జీ.వెంకటేశ్వరరెడ్డి కోరారు. గురువారం ఆయన జేవీఆర్ ఓసీని సందర్శించి నిర్దేశించిన లక్ష్యాలు, ఉత్పత్తి పై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన డిప్యూటీ సూపరింటెండెంట్ కొప్పుల గోవర్ధన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జీఎం ఎం.షాలెంరాజు, పీవో ఎస్‌వీఆర్.ప్రహ్లాద్, ఎంవీ.నరసిం హారావు, ఉద్యోగులు ఉన్నారు.

ఆటో, మోటార్ మహాసభను విజయవంతం చేయాలి



ప్రచారం చేస్తున్న టీయూసీఐ నాయకులు

కల్లూరు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ఈ నెల 15వ తేదిన జరగనున్న జిల్లా ఆటో, మోటార్ ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం కల్లూరులో టీయూసీఐ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకు డు పుల్లారావు కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో, మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నేటి వరకు అమలు పరచలేదన్నారు. ఈ కార్యక్రమంలో నరిసింహారావు, వెంకటేశ్వర్లు, వేణు, వాసుదేవరావు, సురేష్, తిరుపతిరావు, రత్నం పాల్గొన్నారు.



ధాన్యం కాంటా వేస్తున్న హమాలీలు

రైతులకు అందని కాంటా చార్జీలు

» ఏళ్ల తరబడి మంజూరు కాని వైనం

సత్తుపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన వరి ధాన్యానికి సంబంధించి హమాలీ కూలీ డబ్బులు రైతులకు విడుదల కావడం లేదు. గత ఏడేళ్లుగా డబ్బులు చెల్లిస్తామని అధికారులు చెప్పటమే తప్ప డబ్బులు జమ చేసిన దాఖలాలు లేవు. దీంతో రైతులు హమాలీ చార్జిలు వస్తాయనే ఆశలు కూడా వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

సాధారణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు తేమ శాతం ఉండే విధంగా వడ్లను ఆరబెట్టి తాలు లేకుండా చేసి విక్రయించాల్సి ఉంది. ఈ క్రమంలో హమాలీలు ధాన్యం కాంటా వేసి లారీల్లో లోడు చేస్తారు. ధాన్యం కాంటా వేసి లోడు చేసినందుకు గాను క్వింటాకు రూ.50 చొప్పున రైతులు హమాలీలకు చెల్లించాల్సి ఉంది. ధాన్యం కాంటా వేసి లారీల్లోలోడు చేసిన రోజునే హమాలీ చార్జీలు రైతులు చెల్లిస్తూ వస్తున్నారు. ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కాంటా వేస్తే వాటికి సంబంధించిన డబ్బు రైతులు తమ వంతు డబ్బులు చెల్లిస్తున్నారు. రైతులు హమాలీలకు చెల్లించిన డబ్బులను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ప్రతి ఏటా రైతులకు హమాలీ చార్జీలు రైతుల ఖాతాల్లో వేస్తామంటూ అధికారులు చెప్పడమే తప్ప, ఏళ్ల తరబడి హమాలీ చార్జిలు రైతుల ఖాతాల్లో జమకావడం లేదని రైతులు చెబుతున్నారు.

2014లోనూ ఆ తరువాత మరొక సారి మాత్రమే ఐకేపీ కేంద్రాల్లో విక్రయించిన రైతులకు సంబంధించిన ఖాతాల్లో మాత్రమే హమాలీ చార్జిలు జమ అయ్యాయని, ఆ తరువాత జమ కాలేదని రైతులు వాపోతున్నారు. ఒక్కొక్క సొసైటీ పరిధిలో రైతుల ఖాతాల్లో జమ కావాల్సిన హమాలీ చార్జి డబ్బులు గత ఏడేళ్ల కాలంలో రూ.లక్షల్లో ఉన్నాయని చెబుతున్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రైతులు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గత బకాయిలతో పాటు ప్రస్తుతం హమాలీ చార్జిలు తమకు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.